క్లుప్తంగా

ఆలయానికి రూ.2లక్షల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి ఆదోనికి చెందిన పూడూరు సుజాత, సుందర్‌రాజు కుటుంబ సభ్యులు రూ.2.0 5లక్షల విరాళం ఇచ్చారు. ఆదివారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో నగదు అందజేశారు. దాతలకు ఆలయ సంప్రదాయం ప్రకారం సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న గ్రంథాలయాధికారి

సంజామల: మండల పరిధిలోని గిద్దలూరు పుస్తక సంక్షిప్త కేంద్రంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసిందని సంజలమాల గ్రంథాలయ అధికారి తిమ్మారెడ్డి తెలిపారు. మే 2 నుంచి జూన్ 8వ తేదీ వరకు గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిబిరం నిర్వహించారు. చివరి రోజు మొదటి నుంచి పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థుల విజయాలకు గ్రంథాలయాలు ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు. గ్రంథాలయాలను వినియోగించుకుని జ్ఞానం పెంచుకోవాలని తిమ్మారెడ్డి సూచించారు. కార్యక్రమంలో గిద్దలూరు పుస్తక సంక్షిప్త కేంద్రం నిర్వాహకుడు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో కాటసాని


వధూవరులతో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: నియోజకవర్గంలో ఆదివారం జరిగిన పలు వివాహ శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. బనగానపల్లె మండలం అప్పలాపురం, టంగుటూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి సిద్ధం రెడ్డి రామ్మోహన్‌రెడ్డి, అంబటి రవికుమార్‌రెడ్డి, తిరుపంరెడ్డి, హరినాథ్‌రెడ్డి, కిశోర్ ఉన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి


మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

డోన్ టౌన్: ప్రభుత్వ నిబంధనలు విస్మరించి వివిధ రకాల పేర్లతో తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి ఆశోక్ అన్నారు. ఆ సంఘం స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఫీజుల దోపిడీని అరికట్టాల్సిన బాధ్యత రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై ఉందన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించే విధంగా పర్యవేక్షించాల్సిన విద్యాధికారులు కార్యాలయాల్లో కుర్చీలకే పరిమితం అవుతున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అక్బర్ బాషా, రాజేష్ తదితరులు ఉన్నారు.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ

బేతంచెర్ల: రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంటుందని.. అలజడి సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కుటుంబ సభ్యుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గతంలో చేసిన తప్పులు పునరావృతం అయితే జీవితాంతం జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. సమస్యలు ఏవైనా ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, సొంత నిర్ణయాలు తీసుకోవద్దని హితవుపలికారు.

కొలిమిగుండ్లలో మోస్తరు వర్షం

కొలిమిగుండ్ల: వేసవిని తలపించేలా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న తరుణంలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని వర్షం కురిసింది. మండలంలో 15 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ భాస్కర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కొలిమిగుండ్ల, బెలుం, మీర్జాపురం, ఇటిక్యాల తదితర గ్రామాల్లో ఏకదాటిగా గంట పాట వర్షం కురిసింది. కొలిమిగుండ్ల, మీర్జాపురంలోని పొలాల్లో వర్షపు నీరు చేరాయి. ఈ ఏడాదైనా భారీ వర్షాలు కురిసి భూగర్భ జలాలు పెరగాలని రైతులు ఆశిస్తున్నారు. చెరువుల్లో నీళ్లు పూర్తిగా అడుగంటిపోయాయి.

ఆరోగ్య 'యోగం'

- సంపూర్ణ ఆరోగ్యానికి దివ్య ఔషధం యోగా
- 41వ వసంతంలోకి అడుగుపెట్టనున్న గీతాయోగాసన సంఘం
- సామాజిక బాధ్యతతో కార్యక్రమాలు
- యోగా భవన నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం


మున్సిపల్ కార్యాలయ ఆవరణలో యోగా చేస్తున్న సభ్యులు

డోన్: యోగం అంటే ఐక్యం కావడం, ఒక్కటవ్వడం, కలిసిపోవడం, యోగాసనాలు మనం చేసే ప్రతి పనిలో లీనమయ్యేట్లు చేస్తాయి. శారీరక, మానసిక రుగ్మతలను రూపుమాపుతాయి. మానసిక వేదనతో కుంగిపోకుండా మనో నిబ్బరం కోల్పోకుండా యోగసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ప్రతికూల ఆలోచనలను, భావోద్వేగాలను దరిచేరకుండా చేసే సాధనమే యోగా అని ప్రతీతి.

ఒత్తిడిని నియంత్రించే మార్గం

వైఫల్యాల నిరాశలు, భవిష్యత్తు గురించిన భయాలు కలవరపరిస్తే అశాంతి నెలకొంటుంది. అలాగే లక్ష్యాలను సాధించడంలో ఎదురయ్యే అడ్డంకులను ఊహించుకున్నప్పుడు కూడా మనసు అలజడికి లోనవుతుంది. ఇలాంటి ప్రతికూలతను ఛేదించేందుకు యోగా పితామహుడు పతంజలి మహర్షి వేద మంత్రాలను సూచించాడు. చేతి ముద్రల ద్వారా ఒత్తిడిని నియంత్రించే మార్గాలను తెలియజేశాడు. ।యోగా చిత్తవృత్తి నిరోధః। అన్నారు. అంటే ఆలోచనల ఉద్వేగాలను యోగా నిరోధిస్తుందన్నమాట. ।సిద్ధ్యసిద్ధ్యోః సమో భూత్వా సమత్వం యోగ ఉచ్యతే అన్నాడు శ్రీకృష్ణుడు. విజయ సాధనలో ఎదురయ్యే ప్రతికూలతలను ఎదుర్కొని జీవితాన్ని సమతుల్యం చేసుకోవడంలో యోగాసాధన ఉపకరిస్తుందని భావం.

సంపూర్ణ ఆరోగ్యానికి యోగా

శరీరాన్ని, మనసును అనుసంధానం చేసే అద్భుత ప్రక్రియ యోగా. ఆసనాలు శరీర దృఢత్వానికి, మనసుకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని కలిగించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయి. మనిషిలో క్రమశిక్షణ నేర్పి ఆధ్యాత్మిక ఉన్నత జీవన శైలికి కూడా యోగాసనాలు ఉపయోగపడతాయి.

రూ.40లక్షల వ్యయంతో యోగా భవనం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ కేవీఎస్ పార్కులో యోగా భవనం కోసం రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఆహ్లాదకరమైన పార్కులో పచ్చదనం ఉట్టిపడే పరిసరాలు ఉన్నచోట యోగాభ్యాసానికి పార్కు మధ్యలో భవనాన్ని నిర్మించి అందరి ప్రశంసలు అందుకున్నారు.


మత్స్యాసనం

గీతాయోగాసనానికి 41వ వసంతం

పట్టణంలో యోగసనాచార్యులు సూరి రాఘవ దీక్షితులు 40 ఏళ్ల క్రితం గీతాయోగాసన సంఘాన్ని ప్రారంభించగా, వంకదారి వెంకటసుబ్బయ్య, కందిమల్ల రాంపుల్లయ్య ఆధ్వర్యంలో నేడు వందలాది మంది యోగాసన సభ్యులతో సంఘం దినదినాభివృద్ధి చెందుతోంది. సంఘం ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా జూన్ 12వ తేదీ యోగాసన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఆధ్యాత్మికత పెంపొందించే దేశభక్తి ప్రవచనాలను ఏర్పాటు చేస్తారు. నలుగురితో ప్రారంభమైన ఈ సంఘం నేడు 300 మంది సభ్యులతో విరాజిల్లుతోంది.


చక్రాసనం


కేవీఎస్ పార్కులో నిర్మించిన గీతాయోగాసన సంఘం భవనం

అనేక ప్రయోజనాలు



యోగాతో అనేక ఉప యోగాలు ఉన్నాయి. శారీరక దృఢత్వానికి మానసిక ప్రశాంతతకు యోగా ఉత్తమం. ఆసనాలు వేస్తే నరాల్లోని అనేక అడ్డంకులు తొలిగిపోయి ఆరోగ్యంగా ఉంటారు. ఎముకలు దృఢంగా మారుతాయి. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుంది.

–డాక్టర్ మాధవక్రిష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్, నంద్యాల ప్రభుత్వాస్పత్రి

సామాజిక బాధ్యత



ఏటా సంఘం వార్షికోత్సవం సందర్భంగా జూన్ 12వ తేదీ 2కే రన్, రక్తదాన శిబిరాలు, బైక్ ర్యాలీలు, మన నడక.. మన ఆరోగ్యం అనే సామాజిక బాధ్యతను గుర్తుచేసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

–రాంపుల్లయ్య, గురూజీ, గీతాయోగాసన సంఘం

సంపూర్ణ ఆరోగ్యం



కుల, మతాలకు అతీతంగా గీతాయోగాసన సంఘం అనేక కార్యక్రమాలను చేస్తోంది. ముఖ్యంగా మహిళలతో పాటు విద్యార్థులను కూడా యోగా సాధనలో భాగస్వామ్యం చేసింది. యోగా సాధన ద్వారానే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది.

–నాగభూషణంరెడ్డి, న్యాయవాది, సంఘం సభ్యుడు

ప్రతిఫలాపేక్ష లేదు



సంఘంలో సభ్యులు వివిధ రంగాల్లో పనిచేస్తూనే యోగాసన సంఘం కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. యోగాసాధనే కాకుండా ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రజాప్రయోజిత కార్యక్రమాల్లో పాల్గొంటూ సామాజిక సేవ చేస్తున్నారు.

–రంగస్వామి, సంఘం సభ్యుడు, డోన్

ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో అలసత్వం తగదు


పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ

డోన్ టౌన్: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణలో పోలీస్ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని, పనితీరు మెరుగుపర్చుకోవాలని డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయం ఎదుట ట్రాఫిక్ స్టేషన్ సిబ్బంది, ఎస్‌ఐలతో ట్రాఫిక్‌పై సమీక్షించారు. పట్టణంలో బేతంచెర్ల సర్కిల్, కొచ్చెర్వు, కంబాలపాడు రోడ్లలో ఎక్కువగా ట్రాఫిక్‌జామ్ అవుతున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్లియర్ చేయాలని సూచించారు. కూడళ్లలో సెల్‌ఫోన్లు చూస్తూ మాటలు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. లారీలను రూట్ క్లియర్ చేసి పంపాలని తెలిపారు. పట్టణంలో వాహనాల పార్కింగ్ అడ్డదిడ్డంగా లేకుండా పార్కింగ్ స్థలాల్లోనే నిలిపేలా చర్యలు చూసుకోవాలన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించేలా చూడాలని.. అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్‌ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్, ట్రాఫిక్ ఏఎస్‌ఐ శ్రీరాములు, క్యూఆర్టీ సిబ్బంది, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

సామాజిక సేవతోనే ఆత్మసంతృప్తి


రిటైర్డ్ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ప్రభుత్వ పెన్షనర్లు

డోన్: పదవీ విరమణ అనంతరం కబుర్లతో కాలక్షేపం చేయకుండా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని ప్రభుత్వ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి భానుసింగ్ అన్నారు. ఆదివారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రిటైర్డ్ ఉపాధ్యాయుడు లక్ష్మయ్యకు సంఘం సభ్యత్వం ఇచ్చిన అనంతరం సభ్యులు ఘనంగా సత్కరించారు. సామాజిక సేవతోనే ఆత్మసంతృప్తి లభిస్తుందని తెలిపారు. సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుబ్బరాయుడు, కార్యదర్శి గాలయ్య, కోశాధికారి గోపాల్, ఉపాధ్యక్షుడు నరసింహులు, సహాయ కార్యదర్శి ఉసేన్‌సాహెబ్, సభ్యులు రాందాస్‌రెడ్డి, లోకనాథరెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు


ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ

డోన్: రైల్వేశాఖ డీఐజీ, ఎస్పీ, తిరుపతి డీఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున డోన్ రైల్వే జంక్షన్‌లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైళ్ల ద్వారా కొందరు విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి గంజాయి వంటి మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్నారనే సమాచారంతో ప్రయాణికుల లగేజీతో పాటు పార్సల్ కార్యాలయంలో విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు రైల్వే ఎస్‌ఐ బిందుమాధవి తెలిపారు. రైళ్ల ద్వారా మాదకద్రవ్యాలను తరలిస్తున్న తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి


సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు

బేతంచెర్ల: కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో ప్రజా మద్దతు కూడగట్టేందుకు సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజాం బేగ్, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్, నాయకులు ఎద్దులన్న, తిరుమలేష్, వలిబాషా, ఖాజా, మహబూబ్ బాషాలతో పాటు ప్రజలు, కార్మిక సంఘాల నాయకులు సంతకాలు చేశారు. పేద, మధ్య తరగతి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని కోరారు.

• పగలే వెలుగులు


సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద వెలుగుతున్న విద్యుత్ లైట్లు

బనగానపల్లె రూరల్: బనగానపల్లె సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనానికి వెలుపల ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు పగటి పూట కూడా వెలుగుతూనే ఉన్నాయి. విద్యుత్‌ను ఆదా చేయాలని సమావేశాల్లో ఊదరగొట్టే అధికారులు తమ కార్యాలయాల్లో విద్యుత్‌ను వృథా చేయడంపై పట్టణ ప్రజలు విమర్శలు చేస్తున్నారు. శనివారం విధులు నిర్వహించిన సబ్ రిజిస్ట్రార్ అధికారులు, ఉద్యోగులు విద్యుత్ లైట్లను ఆర్పి వేయకుండా అలాగే వెళ్లిపోయారు. ఆదివారం సెలవు కావడంతో లైట్లు నిరంతరాయంగా వెలుగుతూనే ఉన్నాయి. ప్రకటనలే తప్ప ఆచరణలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి మృతి

బేతంచెర్ల: అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతిచెందాడు. వివరాలు..పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో కుమ్మరి చంద్రశేఖర్ (34) నివాసం ఉంటున్నాడు. చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం కొనసాగించేవాడు. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈనెల 4వ తేదీ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మరణించాడు. మృతుని భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు వెల్లడించారు.

ట్రాక్టర్ డ్రైవర్ మృతికి నివాళి


నివాళులర్పిస్తున్న ఎంపీపీ

బేతంచెర్ల: బనగానపల్లె మండలం మీరాపురం గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బేతంచెర్ల హనుమాన్ నగర్ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కనుమకింది కొట్టాల సాములు(28) మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు ఎద్దులన్న, నరసింహులు, రాయుడు, మధుసూదన్, వెంకట్, హుస్సేన్ ఆదివారం సాములు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.


సహస్ర దీపాలంకరణ సేవలో శ్రీదేవి, భూదేవి మద్దిలేటి నరసింహస్వామి

వైభవంగా స్వాతి వేడుకలు

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకుని స్వామివారి జన్మ నక్షత్రమైన స్వాతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేదపండితులు జ్వాలాచక్రవర్తి శ్రీదేవి, భూదేవి సమేతుడైన మద్దిలేటి నరసింహస్వామికి సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, వాసు దేవ పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవ కలశ స్నపనం, నరసింహ హోమం, పంచామృత సహిత విశేష ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూల మంత్ర జపం చేశారు. తర్వాత అలంకార ప్రియుడైన స్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ మాడ వీధుల్లో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య రమణీయంగా ఊరేగింపు చేపట్టారు. ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి, అర్చకులు మనోహర్, రాఘవయ్య, మద్దిలేటిస్వామి పాల్గొన్నారు


నరసింహస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా స్వాతి నక్షత్ర వేడుకలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న చెంచులక్ష్మీ సమేత పావన నరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్ర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు బాలిశెట్టి పావన నరసింహమూర్తి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, తులసీ దళాలతో అర్చనలు, కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మదేవరకు భారీ బందోబస్తు


ఆలయ పరిసరాలను డ్రోన్ ద్వారా వీక్షిస్తున్న డీఎస్పీ ప్రమోద్

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె పెద్దమ్మ దేవర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి పెద్దమ్మ దేవర ఉత్సవాలను తిలకించారు. డీఎస్పీ ప్రమోద్ మాట్లాడుతూ దేవరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పార్కింగ్ స్థలాల కేటాయింపు వంటివాటిపై దృష్టి సారించినట్లు చెప్పారు. భక్తులు ప్రశాంతంగా అమ్మవారి దర్శనం చేసుకునేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ఫ్యూజ్ పోతే అంతే..!

కొలిమిగుండ్ల: మారుమూల పల్లెల్లో కాదు ఏకంగా మండల కేంద్రం కొలిమిగుండ్లలో విద్యుత్ లైన్‌కు సంబంధించి ఫ్యూజ్ పోతే గంటల సమయం పడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేరుకు ఇక్కడ ముగ్గురు లైన్‌మన్‌లు, పోల్ టు పోల్ సిబ్బంది కలిసి నలుగురు పని చేస్తున్నారు. ముగ్గురు లైన్‌మన్లలో ఒకరు అనారోగ్యం కారణంగా విధులకు హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో ప్రైవేట్ వ్యక్తికి కొంత మేర వేతనం ఇచ్చి పని చేయిస్తున్నారు. మరొకరు కారుణ్య నియామకం కింద మహిళకు కేటాయించారు. ఉన్న ఒక్క లైన్‌మన్ మాత్రమే యాక్టివ్‌గా ఉండాల్సి వస్తోంది. పగటి సమయంలో ఫ్యూజ్‌లు పోతేనే గంటల సమయం పడుతుంది. కొన్ని సందర్భాల్లో రాత్రి పది గంటల తర్వాత ఫ్యూజ్ పోతే తెల్లవారే సరికి కూడా సరిచేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరు నెలల నుంచి ఏఈ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పనిచేసే లైన్‌మన్‌లను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.


రహదారికి ఇరువైపులా విక్రయాలు సాగిస్తున్న వ్యాపారులు


కోటపేటలో వ్యాపారులు లేక వెలవెలబోతున్న సంతమార్కెట్

రోడ్లపైనే విక్రయాలు.. వాహనదారుల ఇక్కట్లు

- కోటపేటలో సంతమార్కెట్ ఉన్నా నిరుపయోగం
- రహదారికి ఇరువైపులా వ్యాపారాలు
- పట్టించుకోని నగర పంచాయతీ అధికారులు

బేతంచెర్ల: నగర పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లోపించడం, నిర్లక్ష్యం కారణంగా పట్టణంలోని కోటపేటలో నిర్మించిన సంత మార్కెట్ మూడు వారాలుగా నిరుపయోగంగా మారింది. దీనికి తోడు వ్యాపారులు మార్కెట్ యార్డులో కాకుండా రహదారికి ఇరువైపులా విక్రయాలు సాగిస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కోటపేటలో సంత మార్కెట్‌కు సరైన సౌకర్యాలు లేక వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడేవారు. మండుటెండలో ఉక్కపోత భరిస్తూ, వర్షమొస్తే తడుస్తూ తీవ్ర ఇక్కట్ల మధ్య కూరగాయలు, ఆకుకూరలు విక్రయించేవారు. వారి ఇబ్బందులను గుర్తించి పట్టణ ప్రజలతో పాటు వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా గత వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి 2021 అక్టోబర్ 24న సంతమార్కెట్ ఏర్పాటుకు రూ.45 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో మార్కెట్ యార్డును 60 స్టాల్స్‌తో నిర్మించారు. మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. 2022 సెప్టెంబర్ 30న సంతమార్కెట్ షెడ్డును ప్రారంభించారు. దీంతో వ్యాపారులకు, పట్టణ ప్రజలకు సౌకర్యంగా ఉండేది. అయితే 3 వారాలుగా నగర పంచాయతీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు కోటపేటలో రహదారికి ఇరువైపులా కూరగాయలను ఉంచి సంత నిర్వహిస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడడంతో పాటు కాలనీవాసుల వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు స్పందించి సంత మార్కెట్ షెడ్డులో వ్యాపారాలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.